# అద్భుతాలు కనికట్లు (గారడీ), వైద్యం

బైబిలు 'విశ్వాస' గ్రంథం. దేవుడు మానవ చరిత్రలో జోక్యం చేసుకొని వారినెలా రక్షించాడో బైబిలు గ్రంథం వివరిస్తుంది. బైబిలు గ్రంథంలో 'అద్భుతాలు' ఒక విశిష్టమైన పాత్రను పోషిస్తాయి.. తనను నమ్మినవారి కొరకు దేవుడు చేసిన అద్భుతాలు, యితర దేవుళ్ళను మంత్రతంత్రాలను జ్యోతిష్యాన్ని నక్షత్ర గమనాలను కర్ణపిశానిని ఆశ్రయించడానికి పూర్తిగా భిన్నంగా కన్పిస్తాయి. బైబిలు అంతటిలోనూ దేవుని అద్భుతాలు అసాధారణమైనవి. యివి సాధారణమైన సంభవాలు కాదు.

ఇశ్రాయేలు చరిత్రలో దేవుడు చేసిన ఈ అద్భుతాలను బట్టి ప్రజలు దేవుణ్ణి స్తుతించారు (ద్వితీ 7:19:11:1-4:34:10-12). ఇశ్రాయేలు ప్రజలను కాపాడి వారి కొరకు మేళ్ళ నివ్వడానికి వారు తన మార్గాల్లో నడవడానికి దేవుడు ఈ అద్భుతాలను చేశాడని కీర్తనల రచయితలు, ధర్మశాస్త్రోపదేశకులు వివరించారు (కీర్తన 105: 107: 136: నెహెమ్యా 9 అధ్యాయం).

బైబిల్లో ఈ అద్భుతాలకు స్థూలమైన అర్థం కూడ వుంది. సీనాయి అరణ్యంలో ఇశ్రాయేలీయుల కెదురైన అనుభవాల వర్ణనలో ఈ విషయం విశదంగా అర్థమౌతుంది. తన ప్రజల పట్ల దేవునికి ఓ ప్రత్యేకమైన ఉద్దేశం వున్నట్లు ఈ వర్ణనల్లో కన్పిస్తుంది. వారు సీనాయి అరణ్యంలో ఎదురైనా కష్టాలను అధిగమించడమే కాదు. వాగ్థాన దేశానికి కూడ చేరుకున్నారు (ద్వితీ 4:23,24: 6:21-25:26:5-11: యెహోషువ 24:17). ఇశ్రాయేలీయులు దేవుని వాగ్థానాల పట్ల విశ్వాస్యత చూపడంలో కూడ ఈ అద్భుతాలు దోహదం చేశాయి. అగ్నిగుండం నుంచి సజీవునిగా బయటి కొచ్చిన యూదు యువకులను చూచిన బబులోను రాజు ఇశ్రాయేలు దేవుడు అద్భుతాలు చేసే దేవుడని ఒప్పుకున్నాడు (దానియేలు 3 అధ్యాయం).